## వ్యవసాయ మంత్రి నోట అబద్ధపు మాట

వనపర్తి, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ) : వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అబద్ధాలు వల్లించారు. రైతు భరోసా పడుతున్నదని, రైతులకు పూర్తిగా బోనస్ ఈ రోజు పడిపోయిందని ప్రసంగించారు. శనివారం వనపర్తి జిల్లా కొత్తకోట మండలం సంకిరెడ్డిపల్లి శివారులో ఆయిల్‌పాం కంపెనీ నిర్మాణ పనులకు తుమ్మల భూమి పూజ చేసిన అనంతరం అక్కడే రైతులతో మాట్లాడారు. ఏడాదిలోపు రుణమాఫీ కోసం రూ.40 వేల కోట్లను రైతుల ఖాతాల్లో వేశామని తెలిపారు. రైతు భరోసా ఇస్తున్నామని, బోనస్ కూడా పూర్తిగా ఈ రోజు పడిపోయిందని చెప్పారు. తీరా చూస్తే.. ఒక్క వనపర్తి జిల్లాలోనే రూ.23 కోట్ల బోనస్ రెండు నెలలకుపైగా పెండింగ్‌లో ఉన్నట్టు శనివారం సాయంత్రం నాటి ఆన్‌లైన్ రిపోర్టులు వెల్లడిస్తున్నాయి. మంత్రి మాటను విన్న పలువురు రైతులు సభాస్థలిలో గుసగుసలాడుకోవడం కనిపించింది.

**నా వద్ద డబ్బుల్లేవని టికెట్ లాక్కున్నారు : చిన్నారెడ్డి**

తన వద్ద డబ్బులు లేవని వచ్చిన ఎమ్మెల్యే టికెట్‌ను లాక్కున్నారని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దీంతో సభలో ఒక్కసారిగా నవ్వులు పూసాయి. గతంలో వేలల్లోనే ఎన్నికలకు ఖర్చు ఉండేదని, ఇప్పుడు కోట్లకు చేరిందని పేర్కొన్నారు.

## బీసీ హాస్టళ్లలో మెస్ బిల్లులు చెల్లించాలి

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఆర్ కృష్ణయ్య లేఖ**

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): బీసీ కళాశాల హాస్టళ్లలో మెస్, అద్దె, కరెంటు బిల్లులను వెంటనే చెల్లించాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆయన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు లేఖ రాశారు. ఐదు నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. దీంతో హాస్టళ్లకు కూరగాయలు, పప్పులు, గుడ్లు తదితర వస్తువులు సరఫరా చేసే కాంట్రాక్టర్లు అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బీసీ కాలేజీ హాస్టళ్ల పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరారు.

# గురుకులాలపై విద్యార్థుల్లో అనాసక్తి

- ప్రభుత్వ తీరుతో మసకబారుతున్న రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రభ
- ప్రవేశాలకు విద్యార్థుల అనాసక్తి
- 5వ తరగతిలో ప్రవేశాలకు తగ్గిన దరఖాస్తులు
- 40 వేలకుపైగా తగ్గిన అప్లికేషన్లు
- గురుకులాల్లో దుస్థితే కారణం?



హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): దేశానికే తలమానికంగా నిలిచిన తెలంగాణ గురుకులాలు కాంగ్రెస్ ప్రభుత్వం విధానాలతో కుంటుబడిపోతున్నాయి. నిన్నమొన్నటి వరకు గురుకులాల్లో ప్రవేశాల కోసం తీవ్రంగా పోటీపడ్డ విద్యార్థులు ఇప్పుడు మొఖం చాటేస్తున్నారు. తల్లిదండ్రులు సైతం 'వామ్మో గురుకులం' అంటూ హడలెత్తిపోతున్నారు. విద్యార్థులను చేర్పించేందుకు అనాసక్తి చూపుతున్నారు. తాజాగా ప్రవేశాల కోసం వచ్చిన దరఖాస్తులే అందుకు నిదర్శనంగా నిలుస్తాయి.

**ఈ ఏడాది 88వేల దరఖాస్తులే**

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో 5 నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాల కోసం నేడు రాత పరీక్షను నిర్వహించనున్నది. మొత్తం 1,67,649 దరఖాస్తులు రాగా అందులో 5వ తరగతి ప్రవేశాల కోసం 88,451వేలు కాగా మిగిలినవి 6, 7, 8, 9వ తరగతుల్లో ప్రవేశాలకు సంబంధించినవని అధికారులు తెలిపారు. నిరుడితో పోల్చితే దరఖాస్తులు 40వేలకు పైగా తగ్గిపోయినట్టు చెప్పారు.

**నిన్నమొన్నటివరకూ విపరీతమైన పోటీ**

సాంఘిక, గిరిజన, బీసీ, జనరల్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ప్రవేశాల కోసం నిన్నమొన్నటి వరకూ విపరీతమైన పోటీ నెలకొన్నది. పేద, మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతులకు చెందిన తల్లిదండ్రులు కూడా వారి పిల్లలను గురుకులాల్లో చేర్చేందుకు ఎంతో ఆసక్తి చూపారు. ఉత్సాహంతో ముందుకొచ్చారు. కార్యాలయాల చుట్టూ ప్రదక్షణ చేశారు. అధికారులే సీట్లు ఫుల్ అంటూ బోర్డు పెట్టుకున్న పరిస్థితి. అందుకు గతంలో సీట్ల భర్తీకి వచ్చిన దరఖాస్తులే నిదర్శనం. ఒకానొక దశలో 50వేల సీట్ల కోసం దాదాపు 1.5 లక్షల మంది విద్యార్థులు అంటే ఒక సీటుకు ముగ్గురు పోటీ పడిన పరిస్థితి ఉండేది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో ప్రస్తుతం గురుకులాల్లో ప్రవేశాలకు విద్యార్థులు అనాసక్తి చూపుతున్నారు. తల్లిదండ్రులు జంకుతున్నారు. బీఆర్ఎస్ హయంలో 2023-24 విద్యాసంవత్సరానికి కేవలం ఒక్క 5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరించగా 1.34లక్షల మంది అప్లయ్ చేసుకున్నారు. 2024-25 విద్యాసంవత్సరానికి కూడా 1,20,654 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో రాత పరీక్షకు 1.13 లక్షల మంది హాజరయ్యారు. తుదకు మొత్తంగా అందుబాటులో ఉన్న 51,968 సీట్లలో 50,961 సీట్లనే భర్తీ చేశారు.

**ప్రభుత్వ నిర్లక్ష్యం.. ఫుడ్‌పాయిజన్ కేసులు**

విద్యార్థుల అప్లికేషన్లు గణనీయంగా తగ్గిపోవడానికి గురుకులాల్లో వరుసగా చోటుచేసుకుంటున్న ఫుడ్‌పాయిజన్ కేసులు, విద్యార్థుల మరణాలే కారణమని అధికారవర్గాలు భావిస్తున్నాయి. నిరుడు జనవరి 22న నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి ఎస్సీ గురుకులంలో 9వ తరగతి విద్యార్థిని అనుమానాస్పద మృతితో మొదలైన విద్యార్థుల మరణాలు నేటికీ కొనసాగుతున్నాయి. ఆహారం కలుషితం కావడం, విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం లాంటి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రస్తుతం నమోదైన మొత్తం మృతి కేసుల్లో 25 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. తొమ్మిది మంది విద్యార్థులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా, ఫుడ్‌పాయిజన్‌తో ముగ్గురు విద్యార్థులు మృతిచెందారు. అనారోగ్యం కారణంతో పలువురు విద్యార్థులు మృతిచెందారు. గడచిన ఏడాది కాలంలోనే దాదాపు 52 మంది గురుకుల విద్యార్థులు మృతిచెందినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇవి కేవలం ప్రభుత్వం గురుకులాలు, సంక్షేమహాస్టళ్లలోని ఘటనలు మాత్రమే కావడం గమనార్హం. ఇవికాకుండా ఇప్పటివరకు 45కుపైగా గురుకులాల్లో ఈ ఏడాది ఫుడ్‌పాయిజన్ కేసులు నమోదు కాగా, దాదాపు 1000 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఇంతజరుగుతున్నా ప్రభుత్వం నుంచి ఏమాత్రం చలనం లేకుండాపోయిందని విద్యార్థి సంఘాలు విమర్శిస్తున్నాయి. ఫుడ్‌పాయిజన్ ఘటనలు వెలుగులోకి వచ్చినప్పుడు, విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడినప్పుడు ఆయా గురుకులాల ఉన్నతాధికారులు హడావుడి చేయడం, విచారణ కమిటీ వేయడం, కిందిస్థాయి ఉద్యోగులను సస్పెండ్ చేసి చేతులు దులుపుకోవడం రివాజుగా మారింది తప్ప నిర్మాణాత్మకమైన చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. ఇక ఎస్సీ, ఎస్టీ సంక్షేమ గురుకులాలకు 14నెలలుగా మంత్రి లేడు. ఆ శాఖ ముఖ్యమంత్రి వద్దనే ఉన్నది. గురుకులాలపై పర్యవేక్షణ లేకుండా పోయింది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం గురుకులాల్లో ప్రవేశాలు పొందేందుకు విద్యార్థులు జంకుతున్నారని భావిస్తున్నారు.

### విద్యార్థులందరూ పరీక్షకు హాజరుకావాలి

**బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): గురుకుల ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరూ పరీక్షకు హాజరుకావాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సచివాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు గురుకులాల్లో సీట్ల భర్తీ కోసం ప్రవేశ పరీక్ష నిర్వహించనుండగా, మొత్తంగా 1,67,649 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రవేశపరీక్షను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష రాయనున్న విద్యార్థులకు శుభాకాంక్షలు చెప్పారు.

# డబ్బా పాలు వికటించి కవల పిల్లలు మృతి

**జయశంకర్‌భూపాలపల్లి జిల్లా గొల్లపల్లిలో ఘటన**

**ప్రపంచ కవలల దినోత్సవం రోజే విషాదం**

గణపురం, ఫిబ్రవరి 22: డబ్బా పాలు వికటించి నాలుగు నెలల కవల పిల్లలు మృతి చెందిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా గొల్లపల్లిలో ప్రపంచ కవలల దినోత్సవం రోజే జరిగింది. వివరాల్లోకి వెళ్తే గొల్లపల్లికి చెందిన మర్రి అశోక్-లాస్యశ్రీ దంపతులకు నాలుగు నెలల క్రితం రెండో సంతానంలో కవలు (పాప, బాబు) జన్మించారు. లాస్యశ్రీ పిల్లలతో ఇటీవల తల్లిగారిల్లు నగరంపల్లెకి వెళ్లింది. భర్త అశోక్ గణపురంలోని ఓ మెడికల్ షాపులో పాల పౌడర్ తీసుకొచ్చాడు. శనివారం ఉదయం 8 గంటలకు ఒకసారి, 10 గంటలకు మరోసారి ఆ పాలు తాగించి పిల్లలను పడుకోబెట్టింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో పిల్లల్లో కదలిక లేకపోవడంతో అనుమానం వచ్చి చూడగా ముక్కుల్లోంచి పాలు కారుతూ కనిపించింది. దీంతో పిల్లలను భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే చిన్నారులు మృతి చెందినట్టు నిర్ధారించారు. పౌడర్ పాలు తాగడం వల్లే కవల పిల్లలు మృతి చెందినట్టు తల్లిదండ్రులు, బంధువులు ఆరోపిస్తున్నారు.



పాలపొడి డబ్బా చూపుతున్న చిన్నారుల తల్లి లాస్యశ్రీ

## రాష్ట్రంలో ఏం జరుగుతున్నది?

- రాహుల్‌తో మధుయాష్కీభేటీ
- రాష్ట్ర రాజకీయాలు, కులగణన అంశాలపై చర్చ
- రేవంత్ రిపోర్ట్ క్రాస్ చెక్ చేసుకున్న రాహుల్?

హైదరాబాద్, ఫిబ్రవరి 22(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఏం జరుగుతున్నది? పార్టీలో పరిస్థితి ఎలా ఉంది? సర్కారుపై ప్రజల ఏమనుకుంటున్నారు? ఇలా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరా తీసినట్టుగా తెలుస్తున్నది. ఈ మేరకు శనివారం ఢిల్లీలో రాహుల్‌తో టీపీసీసీ సీనియర్‌నేత మధుయాష్కీగౌడ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య పలు అంశాలు చర్చకు వచ్చినట్టుగా రాజకీయవర్గాల్లో అభిప్రాయం వ్యక్తమవుతున్నది. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు, కులగణన అంశాలపై మధుయాష్కీ రాహుల్‌కు వివరించినట్టు తెలిసింది. ఈ సందర్భంగా రాహుల్ సైతం పలు అంశాలపై మధుయాష్కీ ద్వారా ఆరా తీసినట్టు ప్రచారం జరుగుతున్నది. పార్టీలో, ప్రభుత్వంలో అంతర్గతంగా చోటుచేసుకుంటున్న పరిణామాలపైనా అడిగి తెలుసుకున్నట్టు తెలిసింది. ఇటీవల రాహుల్‌గాంధీని కలిసిన సీఎం రేవంత్‌రెడ్డి కులగణన, పథకాల అమలులపై నివేదించారని పార్టీ వర్గాలు తెలిపాయి. అయితే ఆ వివరాలను మధుయాష్కీ చెప్పిన విషయాలతో రాహుల్ క్రాస్ చెక్ చేసుకున్నట్టుగా తెలిసింది. రాష్ట్ర కార్యవర్గ ఏర్పాటులో పదవులపైనా చర్చించినట్టుగా సమాచారం.



## ఇంటి పన్ను కింద పింఛన్ జమ

భూత్పూర్, ఫిబ్రవరి 22 : వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల ఆసరా పింఛన్ డబ్బులను ఇంటి ట్యాక్స్ కింద పంచాయతీ కార్యదర్శి వసూలు చేసిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం కొత్తమొల్గరలో చోటుచేసుకున్నది. శనివారం కొత్తమొల్గరలో పింఛన్ డబ్బులు పంపిణీ చేయగా, చిల్లా వెంకటేశ్వరమ్మ పింఛన్ తీసుకున్నది. పంచాయతీ కార్యదర్శి మొగిలిరెడ్డి ఇంటి ట్యాక్స్ కింద రూ.950 చెల్లించాలని చెప్పాడు. దీంతో చేసేది లేక వెంకటేశ్వర్‌రెడ్డి వచ్చిన పింఛన్ డబ్బులను పంచాయతీ కార్యదర్శికి చెల్లించి వెళ్లిపోయింది.

## తుమ్మల ఎదుటే కాంగ్రెస్ వర్గీయుల బాహాబాహీ

- మార్కెట్ యార్డు ఏర్పాటుపై వివాదం
- అధికార పార్టీ నేతల మధ్య మరోసారి గ్రూపు తగాదా



చిన్నారెడ్డి, మేఘారెడ్డితో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

గోపాల్‌పేట, ఫిబ్రవరి 22 : వ్యవసాయ మార్కెట్ యార్డు ఏర్పాటు వివాదంగా మారింది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ముందే ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వర్గీయుల మధ్య మరోమారు వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. ఇరు వర్గాల వారు గొడవకు దిగడంతో కొంతసేపు ఘర్షణ వాతావరణం నెలకొన్నది. బుద్ధారం గండి వద్ద పొల్కెపహాడ్ శివారులో మార్కెట్ యార్డు శంకుస్థాపన కోసం మంత్రి తుమ్మల, ఎంపీ మల్లు రవి శనివారం రాగా.. వారి ముందే అధికార పార్టీ నేతలు బాహాబాహీకి దిగారు. మేఘారెడ్డి జిందాబాద్.. చిన్నారెడ్డి జిందాబాద్ అంటూ రెండు వర్గాల వారు నినాదాలు చేశారు. దీంతో చిన్నారెడ్డితో పాటు ఆయన వర్గీయులు మంత్రి వెనుక శంకుస్థాపన స్థలం వద్దకు వచ్చి మార్కెట్‌ను మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు.

# త్వరలో నీరాకేఫ్ ఎత్తివేత ?

నీరాకేఫ్.. కల్లు గీత కార్మికుల ఆత్మగౌరవ పతాక. ఎందరో గౌడన్నలు గుండెలు చరుసుకున్న ప్రతిష్ఠ. ఇప్పుడు ఆ ఆత్మగౌరవ పతాకకు తీవ్ర అవమానం జరుగుతున్నది. హైదరాబాద్ నగర నడిబొడ్డులో అత్యంత సుందరంగా కొలువుదీరిన నీరా కేఫ్‌ను అన్యాక్రాంతం చేసేందుకు టూరిజం శాఖ కంకణం కట్టుకున్నది. నగరంలోని ఎందరో కిడ్నీరాళ్ల వ్యాధిగ్రస్తులకు దివ్య ఔషధంగా, ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్న నీరా, కేఫ్‌ను పూర్తిగా ఎత్తివేసే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. కేఫ్‌ను ఎత్తివేయాలని త్వరలోనే నిర్వాహకులకు నోటీసులు ఇవ్వనున్నట్టు అత్యంత విశ్వసనీయ సమాచారం.

- హోటల్‌గా మార్చేందుకు టూరిజం శాఖ ప్రయత్నాలు
- గౌడన్నల ఆత్మగౌరవ పతాకకు తీవ్ర అవమానం
- త్వరలో కేఫ్ ఖాళీకి నోటీసులు?
- అగ్రకులం వారికి కేఫ్ ధారదత్తం?
- నిర్వహణ పట్టని ఎక్సైజ్ శాఖ
- టూరిజం శాఖ ఎండీ ఇష్టారాజ్యం
- ఏడాదైనా కేఫ్‌ను చూడని మంత్రి




హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): సుమారు రూ.20 కోట్ల ఖర్చుతో హైదరాబాద్ నెక్లెస్‌రోడ్‌లో ఆధునిక వసతులతో నీరా కేఫ్‌ను గత ప్రభుత్వం నిర్మించింది. దేశంలోనే తొలిసారిగా నీరా పాలసీని తీసుకొచ్చిన కేసీఆర్.. ఎందరో గీత కార్మికులకు వెన్నుదన్నుగా నిలిచారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ సూచనల మేరకు నీరాకేఫ్‌ను గౌడన్నల ఆత్మగౌరవ పతాకగా తీర్చిదిద్దారు. ఇప్పుడు దానిని ఎక్కడికి తరలిస్తారో తెలియనంత రహస్యంగా తెరచాటు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నీరాకేఫ్‌కు ఆదినుంచీ అండగా ఉన్న ఎక్సైజ్‌శాఖ దాని బాగోగులు పట్టించుకోకపోవడం, కేఫ్ పెత్తనం మొత్తం టూరిజం శాఖకే కట్టబెట్టడంతో వారు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు.

**కేఫ్‌ను హోటల్‌గా మార్చేందుకు ప్రయత్నాలు**

సుందరమైన నీరాకేఫ్‌ను అక్కడినుంచి పూర్తిగా తీసేసి.. దానిని హోటల్‌గా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. కేఫ్‌లో ఉన్న గ్లాస్ అద్దాలను పూర్తిగా తొలగించారు. హుస్సేన్‌సాగర్ వైపు ఉన్న చెట్లను కొట్టేశారు. నీరాకు, నీరా ఉప ఉత్పత్తులకు ప్రచారం తగ్గించారు. నీరాకేఫ్ నేమ్‌ప్లేట్ పక్కనే ఫుడ్‌కోర్టు బోర్డులు పెట్టి.. నీరాకేఫ్ ప్రాధాన్యాన్ని తగ్గించారు. నగరం నడిగడ్డపై గౌడన్నల కోసం కేసీఆర్ తీర్చిదిద్దిన ఆనవాళ్లు లేకుండా చేసేందుకు.. కేఫ్‌ను పూర్తిగా అన్యాక్రాంతం చేసేందుకు నిర్వాహకులకు కూడా త్వరలోనే నోటీసులు ఇవ్వనున్నట్టు తెలిసింది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను టూరిజం శాఖ సిద్ధం చేసినట్టు విశ్వసనీయ సమాచారం. అవి నీరాకేఫ్ నిర్వాహలకు అందితే.. ఏ క్షణమైనా వారిని ఖాళీ చేయించే ఆస్కారం ఉన్నట్టు తెలిసింది. ఒక పథకంలో భాగంగానే నీరాకేఫ్ నేమ్‌ప్లేట్లు పాడైనా, కేఫ్ పక్కన అపరిశుభ్రంగా ఉన్నా, టూరిజంశాఖ పట్టించుకోవడం లేదని కేఫ్‌ను చూసేందుకు వస్తున్న పర్యాటకులు వ్యాఖ్యానిస్తున్నారు.

**అగ్రకుల వర్గీయులకు హోటల్ నిర్వహణ బాధ్యతలు?**

కేవలం గౌడన్నల ఆత్మగౌరవం కోసమే గత ప్రభుత్వం నీరాకేఫ్‌ను నిర్మిస్తే.. ఆ కేఫ్‌ను తీసేసి, హోటల్‌గా మార్చి.. అగ్రకుల సామాజిక వర్గానికి చెందినవారికి ఇచ్చే యోచనలో టూరిజం శాఖ ఎండీ ప్రకాశ్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి ఉన్నారని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా పూర్తి చేశారని విశ్వసనీయ సమాచారం. గీత కార్మికుల కోసమే నిర్మించిన నీరాకేఫ్‌ను హోటల్‌గా ఎందుకు మార్చుతున్నారో..? ఒక క్రమపద్ధతిలో ఫుడ్‌కోర్టుగా మార్చి.. హోటల్‌గా రూపొందిచాల్సిన అవసరం ఎందుకొచ్చిందో..? దీని వెనుక ఉన్న శక్తులు ఎవరో..? త్వరలోనే 'నమస్తే తెలంగాణ' బయటపెట్టనున్నది. గతంలో ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రిగా ఉన్న శ్రీనివాస్‌గౌడ్ నాటి సీఎం కేసీఆర్ ఆలోచన మేరకు కేఫ్ నిర్మాణం, ప్రారంభోత్సవం, ఆ తర్వాత జరిగిన కేఫ్ ప్రమోషన్ల వరకూ అన్నీ ఆయనే భుజాన వేసుకున్నారు. 'నీరాకు బ్రాండ్ అంబాసిడర్'గా శ్రీనివాస్‌గౌడ్ మారారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 15 నెలలవుతున్నా.. ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రిగా ఉన్న జూపల్లి కృష్ణారావు నీరాకేఫ్ వైపు కన్నెత్తి చూడలేదు.

# నన్ను విలన్‌గా చూస్తున్నరు!

- కాంగ్రెస్ పార్టీ బీసీ నేతల భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు
- కర్రపట్టుకుని కాపాడుకుంటారో మౌనంగా నష్టపోతారో!
- అంతా మీ ఇష్టమంటూ నిష్టూరం
- కులగణనలో సహకరించాలని బీసీ నేతలకు సీఎం అభ్యర్థన



హైదరాబాద్. ఫిబ్రవరి 22(నమస్తే తెలంగాణ): సర్వే చేసి బీసీ రిజర్వేషన్లను ఏదో ఒక రకంగా పట్టాలు ఎక్కిద్దామనుకున్న తననే రాళ్లతో కొడుతున్నారని, తమ పార్టీ నేతలే మీటింగులు పెట్టి తనను విలన్‌గా చేసి మాట్లాడుతున్నారని, కులగణన చేయని వాళ్లను మంచోళ్లుగా పొగుడుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించినట్టు తెలిసింది. లెక్కలు చెప్పకుండా తప్పించుకున్న వాళ్లను మంచోళ్లను చేసి, బీసీ లెక్కలు తేల్చిన తనను చెడ్డోనిగా చూస్తే ఎలా? అని ఆయన కాంగ్రెస్ పార్టీ బీసీ నేతలను ప్రశ్నించినట్టు సమాచారం. పార్టీలో మిగిలిన విషయాల్లో విభేదించినా తనకు ఇబ్బంది లేదని, కానీ కులగణన విషయంలో మాత్రం తనకు సహకరించాలని వారిని వేడుకున్నట్టు సమాచారం. శనివారం ప్రజాభవన్‌లో కాంగ్రెస్ బీసీ నేతతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం అయ్యారు. ఈ భేటీలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, బీసీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు పాల్గొన్నారు. కులగణన సర్వే బలహీనవర్గాల భావోద్వేగమని, ఎవ్వరూ చేయని పనిని తాను చేశానని, కర్ర పట్టుకొని కాపాడుకుంటారో.. లేదంటే మౌనంగా ఉండి నష్టపోతారో.. మీ ఇష్టం అంటూ బీసీ నేతలను ఉద్దేశించి సీఎం నిష్టూరమాడినట్టు చర్చ జరుగుతున్నది.

**మన వాళ్ల మౌనం సరికాదు**

సర్వేకు చట్టబద్ధత కల్పించే వరకే తన బాధ్యత అని, దానిని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత కాంగ్రెస్ బీసీ నాయకుల మీదనే ఉన్నదని, కులగణన సర్వే లెక్కలు బయటపెట్టొద్దని కొందరు తన మీద ఒత్తిడి తెచ్చారని, అయినా తాను పట్టించుకోలేదని సీఎం చెప్పినట్టు తెలిసింది. సెకండ్ ఫేజ్ సర్వే పూర్తయిన తర్వాత దీనికి చట్టబద్ధత కల్పిస్తామని అన్నట్టు తెలిసింది. బీసీ లెక్కలు తప్పని కొందరు తప్పుడు ప్రచారం చేస్తుంటే, మన వాళ్లు మౌనంగా ఉంటున్నారని, బీసీ కాంగ్రెస్ నేతలు ప్రతిపక్షాల ఉచ్చులో పడొద్దని చెప్పినట్టు తెలిసింది. సర్వేకు ప్రజామోదం కూడా ముఖ్యమని, కాంగ్రెస్ నేతలు అన్ని సామాజికవర్గాలతో సమావేశాలు పెట్టి కులగణన మీద తీర్మానాలు చేయాలని, యూనివర్సిటీల్లో విద్యార్థులు సెమినార్లు నిర్వహించాలని సూచించినట్టు తెలిసింది. బలహీనవర్గాలకు ఇదే భగవద్గీత, ఇదే ఖురాన్, ఇదే బైబిల్ అని ఇంతకంటే మించిన పాలసీ డాక్యుమెంట్ ఏదీ లేదని రేవంత్‌రెడ్డి పేర్కొన్నట్టు తెలిసింది.


### తిట్టుకున్న వీహెచ్, అంజన్‌కుమార్‌యాదవ్

బీసీ నేతల సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నేతలిద్దరు వాగ్వాదానికి దిగినట్టు తెలిసింది. మాజీ ఎంపీలు వీ హన్మంతరావు, అంజన్‌కుమార్ యాదవ్ ఒకరినొకరు తిట్టుకున్నట్టు సమాచారం. వీహెచ్ మాట్లాడుతూ.. తెలంగాణలో గౌడ, ముదిరాజు, మున్నూరుకాపు, పద్మశాలి నాలుగే ప్రధాన బీసీ కులాలు ఉన్నాయని అన్నట్టుగా తెలిసింది. అంజన్‌కుమార్‌యాదవ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, మరో ప్రధాన కులమైన యాదవులను ఎలా మరిచిపోతారని నిలదీసినట్టు సమాచారం. వీహెచ్ ప్రతిస్పందిస్తూ.. 'నీకేం తక్కువైంది.. కొడుక్కు రాజ్యసభ ఇప్పించుకున్నవ్ గదా..' అని వ్యాఖ్యానించడంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగినట్టు సమాచారం.

### సీఎం పక్కన నిలబడని బీసీ నేతలు!

తాను చేసిన లెక్కలు దేశానికే ఆదర్శమని, చరిత్రలో నిలిచిపోతాయని సీఎం అన్నట్టు తెలిసింది. బీసీ కులగణన సర్వే కోసం తాను చాలా కష్టపడ్డానని, కానీ తననే విలన్‌ను చేసి మాట్లాడిన తరువాత ఇది ఎలా ముడివడుతుందని సీఎం రేవంత్‌రెడ్డి బీసీ నేతలను నిలదీసినట్టు తెలిసింది. తాను చెప్పింది కరెక్టు అనుకున్నవాళ్లు వచ్చి తన పక్కన నిలబడాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరగా.. ఒక్క బీసీ నేత కూడా సీఎం పక్కన నిలబడలేదని తెలిసింది.

## అష్టభుజ వీరభద్ర శిల్పం లభ్యం



హైదరాబాద్, ఫిబ్రవరి 22(నమస్తే తెలంగాణ): సూర్యాపేట జిల్లా ఎర్రకుంట తండ చింతలచెరువుకోటలో ఓ శిథిల ఆలయంలో అష్టభుజ వీరభద్రశిల్పంతోపాటు కాకతీయుల కాలంనాటి శాసనాలను కొత్త తెలంగాణ చరిత్ర బృందం గుర్తించింది. ఐదు అడుగుల ఎత్తైన వీరభద్రుడి శిల్పం ఉన్నట్టు బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ తెలిపారు. కాకతీయుల నాటి శిలా ఫలకంపై తెలుగు లిపి ఉన్నట్టు పేర్కొన్నారు. క్రీ.శ. 1297 ఏప్రిల్ 27(శనివారం)న ప్రాంపేట ఊరి నడుమనగల మల్లినాథునికి ధూప దీప నైవేద్యాల కోసం గద్దె భూమిని దానం చేసినట్టుగా శాసనాలపై రాసివున్నట్టు వివరించారు.

# తెలంగాణలోనే 5 డీఏలు పెండింగ్

- ఏ రాష్ట్రంలో ఇన్ని డీఏలు పెండింగ్‌లో లేవు
- 80 సార్లు కలిశాం.. వందలసార్లు వినతిపత్రాలిచ్చాం
- 450కిపైగా డిమాండ్లలో ఏ ఒక్కటీ పరిష్కారంకాలే
- మార్చి తర్వాత ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం: టీజీవో




టీజీవో సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు శ్రీనివాసరావు, చిత్రంలో సంఘం నేతలు

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ) : దేశంలోని మరే రాష్ట్రంలో ఐదు డీఏలు పెండింగ్‌లో లేవని, ఒక్క తెలంగాణలో మాత్రమే ఇన్ని డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని టీజీవో అసహనం వ్యక్తంచేసింది. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండటం గర్హనీయమని పేర్కొన్నది. టీజీవో విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశాన్ని శనివారం ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించారు. టీజీవో అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. తక్షణమే రెండు డీఏలు విడుదల చేసి, మరో రెండు డీఏలను పీఆర్సీలో కలపాలని డిమాండ్ చేశారు. 450కి పైగా డిమాండ్లు పెండింగ్‌లో ఉన్నాయని, తమ సమస్యలను సీఎంకు చెప్పినా సీఎస్‌కు చెప్పినా ఏ ఒక్క సమస్య పరిష్కారం కావడంలేదని అసహనం వ్యక్తంచేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించిన 8వేల కోట్ల పెండింగ్ బిల్లులున్నాయని పేర్కొన్నారు. సీఎం హామీ ఇచ్చినా ఇంత వరకు పెండింగ్ బిల్లులు విడుదల కాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. కొందరు అధికారులు కావాలని బదిలీలు చేపట్టడంలేదని వాపోయారు. ఈ విషయమై 70-80 సార్లు అధికారుల చుట్టూ తిరిగామని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ ఉద్యోగ సంఘాలతో చర్చలు జరపలేదని శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో టీజీవో అసోసియేట్ అధ్యక్షుడు బీ శ్యామ్, ఉపాధ్యక్షుడు మాచర్ల రామకృష్ణాగౌడ్, బీ సహదేవ్, జగన్మోహన్‌రావు, కోశాధికారి ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'ఫాల్కన్'పై ఈడీ కేసు

**విదేశాలకు నిధులు మళ్లించడంపై ఆరా**

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ పేరిట దాదాపు 6,979 మందిని మోసగించిన ఫాల్కన్ ప్రైవేట్ లిమిటెడ్‌పై ఈడీ శనివారం కేసు నమోదు చేసింది. డిపాజిటర్లకు అధిక లాభాలను ఆశచూపి రూ.1,700 కోట్లు వసూలు చేసిన 'ఫాల్కన్' నిర్వాహకులు అందులో రూ.850 కోట్లను విదేశాల్లోని 22 డొల్ల కంపెనీలకు మళ్లించినట్టు ఇప్పటికే సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం తేల్చింది. 19 మందిపై కేసులు నమోదు చేసి, ముగ్గురిని అరెస్టు చేశారు. ప్రధాన నిందితులైన ముగ్గురు దుబాయ్‌కి పారిపోయినట్టు పోలీసులు గుర్తించడంతో వారు వినియోగించిన 25 బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు.

## పోలీస్ శాఖ అవసరాలు తీరుస్తం

**నగరాభివృద్ధికి తగ్గట్టు భద్రత పెరగాలి: భట్టి విక్రమార్క**



హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ప్రతి పౌరుడు సురక్షితంగా ఉన్నాడనే భరోసా కల్పించేందుకు పోలీసు శాఖ అవసరాలు తీర్చే బాధ్యత తాము తీసుకుంటామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సచివాలయంలో శనివారం హోంశాఖ ప్రీ బడ్జెట్ సమావేశాల్లో ఆయన పలు అంశాలపై పోలీసు ఉన్నతాధికారులతో చర్చించారు. దేశంలోనే తెలంగాణ పోలీస్ శాఖకు మంచి పేరుందని పేర్కొన్నారు. సైబర్ క్రైమ్ కేసులను పరిష్కరిస్తున్న సిబ్బందికి అభినందనలు తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది నివాసానికి క్వార్టర్స్ నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. గ్రేహౌండ్స్, నార్కోటిక్స్, ఇంటెలిజెన్స్, ఫైర్, ఎక్స్ సర్వీస్‌మెన్ తదితర ఎనిమిది విభాగాల ఉన్నతాధికారులు వారికి కావాల్సిన బడ్జెట్ ప్రతిపాదనలను అందజేశారు. డీజీపీ జితేందర్ మొత్తం శాఖాపరంగా అవసరమైన బడ్జెట్ నివేదికను సమర్పించారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రవి గుప్తా, హైదరాబాద్ సిటీ కమిషనర్, డీజీ సీవీ ఆనంద్, డీజీ అభిలాష బిస్త్, గ్రేహౌండ్స్, ఆక్టోపస్ అడిషనల్ డీజీ స్టీఫెన్ రవీంద్ర, రాచకొండ సీపీ సుధీర్‌బాబు, సైబరాబాద్ సీపీ అవినాష్ మొహంతి తదితరులు పాల్గొన్నారు.